సాక్షి
అనంతపురం
మంగళవారం । 23 । మే । 2023



చీనీ టన్ను రూ.37,500

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,500 పలికాయి.



పాడి రైతుకు భరోసా

పాడి రైతులకు భరోసా ఇస్తూ జగన్ సర్కారు తాజాగా 'వైఎస్సార్ పశుబీమా పథకాన్ని' అమల్లోకి తెచ్చింది.

IIలో

గరిష్టం/కనిష్టం
41.2°/22.8°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది. వేసవి తాపం, ఉక్కపోత అధికంగా ఉన్నాయి.

పవర్ ఫుల్



తరచూ కాలిపోయే మోటార్లు ... పాత ట్రాన్స్‌ఫార్మర్లతో చిక్కులు... లోఓల్టేజీతో సతమతం.. కరెంటు కోతలతో అవస్థలు.. ఇలా ఎన్నో సమస్యలతో అన్నదాతలు ఇబ్బందులు పడేవారు. అయితే ఇదంతా గతం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో కరెంట్ కష్టాలకు చెక్ పడింది.

- విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- హెచ్‌వీడీఎస్ ద్వారా నాలుగేళ్లలో రూ.1600 కోట్లకు పైగా వ్యయం
- లక్షకు పైగా ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ
- కరెంటు కష్టాలకు చెక్
- నాణ్యమైన విద్యుత్ సరఫరాపై అన్నదాతల హర్షం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: విద్యుత్ సంస్కరణల్లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల ఫలాలు రైతులకు చేరాయి. విద్యుత్ సరఫరాలో ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా చూడాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయం నెరవేరింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపట్టిన హెచ్‌వీడీఎస్ (హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం)తో రైతులకు ఊరట కలిగింది. నాలుగేళ్లకు మునుపు లో ఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

1.89 లక్షల మందికి ఊరట

విద్యుత్ లైన్లు మొదలుకొని, ట్రాన్స్‌ఫార్మర్ల వరకూ హెచ్‌వీడీఎస్‌లో భాగంగా తాజాగా పనులు చేపట్టారు. 16 కేవీఏ, 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త విద్యుత్ లైన్లు వంటివి భారీగా వేశారు. దీనివల్ల 1,89,279 వ్యవసాయ కనెక్షన్లు ఉన్న రైతులు ఇబ్బందులు తప్పాయి. ఓల్టేజీ సమస్యతో పాటు మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అవడం లాంటివి ఇప్పుడు మచ్చుకు కూడా లేవు. అభివృద్ధి పనులకు తోడు కోతల్లేని నిరంతర 9 గంటల విద్యుత్ కూడా సరఫరా చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1608 కోట్ల వ్యయం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగేళ్లలో హెచ్‌వీడీఎస్ కింద రూ.1608.98 కోట్లు వ్యయం చేశారు. దీన్నిబట్టి విద్యుత్ సంస్కరణలు ఏ స్థాయిలో జరిగాయో అంచనా వేయొచ్చు. అనంతపురం జిల్లాలో రూ.916.86 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.692.12 కోట్లు ఖర్చు చేశారు. అత్యధికంగా ఒక్క శింగనమల నియోజకవర్గంలోనే రూ.313 కోట్లు వ్యయం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్యధికంగా మడకశిర నియోజకవర్గంలో రూ.144.44 కోట్లు ఖర్చు చేసి మెరుగైన విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

హెచ్‌వీడీఎస్ పరిధిలోకి వచ్చిన వ్యవసాయ కనెక్షన్లు, చేసిన వ్యయం

అనంతపురం జిల్లాలో...

నియోజకవర్గం	సర్వీసులు	చేసిన వ్యయం
అనంతపురం	80	రూ.0.65 కోట్లు
గుంతకల్లు	7,085	రూ.59.30 కోట్లు
కళ్యాణదుర్గం	20,595	రూ.176.55 కోట్లు
రాయదుర్గం	15,847	రూ.136.00 కోట్లు
శింగనమల	36,547	రూ.313.69 కోట్లు
తాడిపత్రి	11,093	రూ.94.27 కోట్లు
ఉరవకొండ	10,527	రూ.88.40 కోట్లు
రాప్తాడు	6,524	రూ.48.00 కోట్లు

హెచ్‌వీడీఎస్ పనులు ఇలా...

మదర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు	9,158
16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ	25,570
25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ	77,965



విద్యుత్ కష్టాలు తప్పాయి



టీడీపీ హయాంలో లోఓల్టేజీ కారణంగా ఎన్నో కష్టాలు అనుభవించాం. పైభాగానున్న మోటర్లు ఆగితేగాని దిగువనున్న బోర్లు నడిచేవి కావు. ట్రాన్స్‌ఫార్మర్లు సైతం లోడ్‌కు తట్టుకోలేక తరచూ మరమ్మతుకు గురయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. ప్రతి రెండు మోటర్లకు ఒక హెచ్‌వీడీఎస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇప్పుడు పంట సాగుకు ఏ ఇబ్బందీ లేదు.

– హనుమేష్ , రైతు, బొమ్మనహాళ్

లో ఓల్టేజీ మాటేలేదు



రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలతో ప్రజలందరికీ మేలు చేసింది. తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ బోరుబావులకు సరఫరా జరుగుతోంది. హెచ్‌వీడీఎస్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వల్ల లో ఓల్టేజీ అన్న మాటే వినపడకుండా పోయింది. ఈ కారణంగా పంటలెక్కడా ఎండిపోకుండా కాపాడుకుంటున్నాం.

– మంజునాథరెడ్డి, రైతు, గుమ్మఘట్ట

నాణ్యమైన విద్యుత్ సరఫరా



గతంలో ఎప్పుడూ లేనివిధంగా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. హెచ్‌వీడీఎస్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల విద్యుత్ వ్యవస్థలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేని కరెంటు సరఫరా జరుగుతోంది.

– సురేంద్ర, ఎస్ఈ

న్యూస్‌రీల్

ఎల్‌డీఎంగా సత్యరాజా బాధ్యతలు



అనంతపురం అగ్రికల్చర్: లీడ్‌బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ (ఎల్‌డీఎం)గా తమిళనాడుకు చెందిన డి.సత్యరాజా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక లీడ్‌బ్యాంకు కార్యాలయంలో గత 15 రోజులుగా ఇన్‌చార్జిగా ఉన్న కెనరాబ్యాంకు ఏజీఎం నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పని చేస్తున్న బి.నాగరాజారెడ్డిని బెంగళూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా ఎల్‌డీఎం సత్యరాజా ఇక్కడికి బదిలీపై వచ్చారు. సాధ్యమైనంత త్వరగా అనంతపురం జిల్లా గురించి అవగాహన చేసుకోవడంతో పాటు తెలుగు భాషపై పట్టు సాధిస్తానని సత్యరాజా తెలిపారు. ఖరీఫ్‌లో పంట రుణాల రెన్యూవల్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉన్నందున రైతులు ఇబ్బంది పడకుండా బ్యాంకులను సమన్వయం చేస్తామన్నారు. త్వరలోనే 2023–24 వార్షిక రుణ ప్రణాళికకు విడుదల చేసి అమలయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం ఆయన కలెక్టర్ ఎం.గౌతమిని మర్యాద పూర్వకంగా కలిసి స్పందన కార్యక్రమానికి హాజరయ్యారు.

డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం అగ్రికల్చర్: సహకార శాఖ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు చేయాలనుకునే వారు జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ బ్యాచ్ కింద 24 వారాల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. సహకార సంస్థలు, సహకార సంఘాల్లో పనిచేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా కోర్సు ఉండాలని నిర్దేశించినందున... సహకార చట్టం కింద రిజిస్టర్ అయిన సంస్థలు, సంఘాల సభ్యులు, పాలక వర్గాలు, సిబ్బంది ఉపయోగించుకోవాలని సూచించారు. డిప్లొమా కోర్సుకు సహకార సంస్థల సిబ్బందికి 10వ తరగతి, ఇతరులు ఇంటర్ ఉత్తీర్ణత అవసరమన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు సెల్ నంబర్ 77803 01899ను సంప్రదించాలని సూచించారు.

50 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు



అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిలో వెనుకబడిన 50 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా దీవెన , వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న తోడు, ఈబీసీ నేస్తం పురోగతిలో వెనుకబడిన విద్యా సహాయకులు, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

సత్యసాయి ప్రాజెక్ట్ నుంచి గ్రామాలకు తాగునీరు



కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరా పునః ప్రారంభించినట్లు ఆ ప్రాజెక్ట్ డీఈ రామారావు తెలిపారు. 15 రోజుల క్రితం మోటర్లు మోరాయించడంతో ప్రాజెక్ట్ పరిధిలోని 164 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయిందన్నారు. నూతన మోటర్లను కంపెనీకి ఆర్డర్ పెట్టామని , మరో 15 రోజుల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతవరకు 40 హెచ్‌పీ, 100 హెచ్‌పీ మోటార్లను అమర్చి ఆత్మకూరు సెగ్మెంట్‌లోని గ్రామాలకు ఒక రోజ, కళ్యాణదుర్గం సెగ్మెంట్ పరిధిలోని గ్రామాలకు మరొకరోజు చొప్పున విడతల వారీగా నీటిని సరఫరా చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. 125 హెచ్‌పీ కొత్త మోటర్లు వచ్చాక 164 గ్రామాలకు గతంలో మాదిరిగా నీటిని సరఫరా చేస్తామని వివరించారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- మార్గదర్శకాలు విడుదల... త్వరలో షెడ్యూలు



రాప్తాడురూరల్: టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం మార్గదర్శకాలు రూపొందించిన జీఓ 47ను విడుదల చేసింది. బదిలీలకు సంబంధించిన షెడ్యూలు మాత్రం ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే షెడ్యూలు విడుదల అవుతుందని అధికారులు చెబుతున్నారు. 5 అకడమిక్ సంవత్సరాలు పూర్తయిన హెచ్‌ఎంలు, 8 అకడమిక్ సంవత్సరాల సర్వీస్ పూర్తయిన టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఆ ప్రకారం ఒక స్కూల్‌లో 2018 నవంబరు 18లోపు చేరిన హెచ్‌ఎంలు, 2015 నవంబరు 18లోపు చేరిన టీచర్లు బదిలీ అవుతారు. జీరో సర్వీసు ఉన్నవారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- పాత జిల్లాల ప్రకారం వెబ్‌కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు ఉంటాయి. 2025 మే 31 వ తేదీ లోపు (రెండేళ్లలోపు) పదవీ విరమణ చేయబోయే వారు కోరకుంటే తప్ప బదిలీ చేయరు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే టీచర్లకు మాత్రమే ప్రిపరెన్షల్ కేటగిరీగా పరిగణిస్తారు. వారి పిల్లలు, తల్లిదండ్రులు, భర్త/భార్య బాధపడుతుంటే మాత్రం వర్తించదు. దృష్టిలోపం (40 శాతం) ఉన్న టీచర్లు, ఆర్థోపెడికల్ ఛాలెంజ్డ్ టీచర్లకు (75 శాతం) బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. అయితే ఆసక్తి ఉంటే బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- మొదటి కేటగిరీ పాఠశాలల్లో పని చేసే టీచర్లకు ఏడాదికి 1 పాయింటు, రెండో కేటగిరీ పాఠశాలల టీచర్లకు రెండు పాయింట్లు, మూడో కేటగిరీ పాఠశాలల టీచర్లకు మూడు పాయింట్లు, నాల్గో కేటగిరీ పాఠశాలల టీచర్లకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు.
- అవివాహితులు, స్పౌజ్, పీహెచ్ కేటగిరీ, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులకు 5 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. సర్వీస్‌కు సంబంధించి ఏడాదికి 0.5 మార్కులు కేటాయిస్తారు.

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 10 మండలాల పరిధిలో 3.2 మి.మీ సగటు నమోదు కాగా చాలా మండలాల్లో గాలులు కొనసాగాయి. శెట్టూరు 31.4 మి.మీ, కుందుర్పి 20.6 మి.మీ, రాయదుర్గం 16.4మి.మీ, బెళుగుప్ప 16 మి.మీతో పాటు బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, తాడిపత్రి తదితర మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. కాగా 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయడంతో ఆత్మకూరు, రాయదుర్గం, డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్, కుందుర్పి, కంబదూరు, రాప్తాడు తదితర మండలాల పరిధిలో 25 గ్రామాల్లో 106 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ.87 లక్షల వరకు పంటనష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేశారు. అలాగే వ్యవసాయ పంటలకు కూడా కొంత నష్టం జరిగినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, అశోక్‌కుమార్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షసూచన ఉందన్నారు. వేసవి వాతావరణం కొనసాగుతుందని తెలిపారు.



దెబ్బతిన్న కూరగాయల నర్సరీ

సన్‌రైజ్, విజయ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు

అనంతపురం క్రైం: మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టాన్ని అతిక్రమించిన కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో ఉన్న సన్‌రైజ్, సాయినగర్ రెండో క్రాస్‌లో ఉన్న విజయ ఆస్పత్రులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ యుగంధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఎంటీపీ యాక్ట్ 1971, 2002/03 ప్రకారం సదరు ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సన్‌రైజ్ ఆస్పత్రి నిర్వాహకులు 4, విజయ ఆస్పత్రి నిర్వాహకులు 13 అబార్షన్లు చేసినట్లు తమ తనిఖీలో తేలిందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఈ రెండు ఆస్పత్రులకు షోకాజ్ జారీ చేశామని చెప్పారు. వారిచ్చే వివరణకనుగుణంగా శాఖాపరమైన చర్యలుంటాయన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నారు.

వైద్యంతో ప్రాణాలు కాపాడాలి

అనంతపురం క్రైం: ఆపదలో ఉన్న గ్రామీణులకు సత్వర వైద్యం అందించేందుకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు అందించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని గోల్డెన్ అవర్‌లో రోగులకు వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలని ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్, బేసిక్ లైఫ్ స్కిల్ కార్యక్రమం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు సూచించారు. సోమవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వైఎస్సార్ విలేజ్ హెల్ క్లినిక్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (ఎంఎల్‌హెచ్‌పీ) లకు బేసిక్ లైఫ్ స్కిల్‌పై అందిస్తున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. జిల్లాలోని 463 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు పాము, కుక్క కాటు, తీవ్రమైన గాయాలు, ఐవీ ఇంజెక్షన్లు ఏవిధంగా అందించాలన్న దానితో పాటు ఫస్ట్ ఎయిడ్‌పై వారం రోజుల పాటు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి, డీఐఓ యుగంధర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి , ఎన్‌హెచ్‌ఎం డీపీఎం చెన్నకేవులు , ప్రోగ్రాం ఆఫీసర్లు సుజాత, కే లక్ష్మీ, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్

గైర్హాజరైనా, ఆలస్యంగా వచ్చినా చర్యలు

- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'స్పందన' కార్యక్రమానికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైనా.... ఆలస్యంగా వచ్చినా... చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ గౌతమి అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కలెక్టర్ ఉదయం 9.55 గంటలకు వచ్చారు. అప్పటికీ చాలా మంది అధికారులు రాకపోవడాన్ని గమనించిన ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుశాఖకు సంబంధించిన అధికారి ఉదయం 11 గంటల సమయానికీ రాకపోవడంతో ఎస్పీ కె.శ్రీనివాస్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఫోన్ చేసి చెప్పారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందన ఇన్‌చార్జి వాణిశ్రీ ద్వారా హాజరు పట్టిక తెప్పించుకొని పరిశీలించారు. అధికారులు ఎవరైనా అనుమతి తీసుకోకుండా గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యల తీసుకుంటామని హెచ్చరించారు. స్పందనలో ప్రజల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతో పాటు డీఆర్ఓ గాయత్రిదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కేశవనాయుడు, డీఈఓ సాయిరాం అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 393 వినతులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన మార్గదర్శకాల ప్రకారం అర్జీలను పరిష్కరించాలని చెప్పారు. ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.

విద్యా కానుక కిట్లను పరిశీలించండి

జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 9 మంది మాత్రమే పరిశీలనకు వెళ్లారని, మిగిలిన వారు బుధవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు కిట్‌లోని వస్తువుల నాణ్యతను తనిఖీ చేయాలని చెప్పారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి, అధికారులు

అర్హులందరికీ జగనన్న తోడు

జిల్లాలో అర్హులైన చిరువ్యాపారులందరికీ జగనన్న తోడు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. జగన్న తోడు అంశంపై కలెక్టర్ సోమవారం తన చాంబర్ నుంచి డీఆర్‌డీఏ, మెప్మా, బ్యాంకర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న తోడు 6వ విడతలో 12,038 మంది చిరువ్యాపారులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఈనెల 31వ తేదీలోగా వారందరి దరఖాస్తులు ప్రాసెసింగ్ చేయాలని చెప్పారు. సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పని చేసి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అలాగే జిల్లాలో అర్హులైన ప్రతివ్యక్తి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (జీవిత బీమా), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (ప్రమాద బీమా) పథకాల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

25న జగనన్న ఆణిముత్యాలు

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఈనెల 25న నియోజవకర్గాలస్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జగనన్న ఆణిముత్యాలు, నాడు–నేడు విద్య, తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. టాపర్ల ఎంపికలో పొరపాట్లు, విమర్శలకు తావివ్వకూడదని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల్లో నాడు–నేడు కింద చేపట్టి పనులు నాణ్యతో రాజీపడకుండా పూర్తి చేయించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాయలసీమ జిల్లాల్లో ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 137 మంది డ్రాపౌట్లు ఉన్నట్లు నివేదిక వచ్చిందని, వీరంతా తిరిగి పాఠశాలలో చేరేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ ప్రేమ్‌చంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, జడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హసాన్‌బాషా, డీఎస్ఓ శోభరాణి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'సప్లిమెంటరీ'కి సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో పరీక్షలు రాయనున్న 32,873 మంది విద్యార్థులు
- 77 కేంద్రాల ఏర్పాటు

రాప్తాడురూరల్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 32,873 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం పరీక్షలు 20,551 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 12,322 మంది రాయనున్నారు. మొత్తం 77 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 77 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 77 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 24 మంది కస్టోడియన్లను నియమించారు. పరీక్షల నిర్వహణపై వీరందరికీ శిక్షణ కూడా పూర్తయింది. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. ఉదయం 8.30 గంటల్లోపు, మధ్యాహ్నం 2 గంటల్లోపు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని ఆర్ఐఓ కార్యాలయంలో అనుసంధానం చేశారు. ఇక్కడి నుంచే అన్ని కేంద్రాలను పర్యవేక్షిస్తారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి కేంద్రంలోనూ చల్లని తాగునీటి వసతి కల్పించనున్నారు. ఆర్ఐఓ, డీవీఈఓలతో పాటు హై పవర్ కమిటీ, డీఈసీ సభ్యులు పరీక్షలను పర్యవేక్షించనున్నారు.



పరీక్ష కేంద్రాలకు తరలిస్తున్న మెటీరియల్

అన్ని ఏర్పాట్లు చేశాం



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. నిఘా నీడలో పరీక్షలు జరుగుతాయి. సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయింది. విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పని చేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి.

– సురేష్‌బాబు, ఆర్ఐఓ

పరీక్ష కేంద్రాలకు మెటీరియల్

పరీక్షల నిర్వహణ మెటీరియల్‌ను అన్ని కేంద్రాలకు తరలించారు. ఓఎంఆర్ షీట్లు, సెంట్రల్ నామినల్ రోల్స్ (సీఎన్ఆర్), డీ.ఫారాలు, మెయిన్ ఆన్సర్ షీట్లు తదితర వాటిని కేంద్రాలకు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

'చిత్రావతి'లో బాలుడి మృతదేహం



రోషన్ (ఫైల్)

యల్లనూరు: మండలంలోని లక్షుంపల్లి సమీపంలోని చిత్రావతి నదిలో ఓ బాలుడి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన నజీర్ బాషా కుమారుడు రోషన్ బాషా (15)గా గుర్తించినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. రెండు రోజులకోసారి ఇంట్లో గొడవ పడి పారిపోయేవాడని, మళ్లీ రెండు మూడు రోజులకు ఇంటికి వెళ్లేవాడన్నారు. ఈ నేపథ్యంలో లక్షుంపల్లి గ్రామానికి ఎలా చేరుకున్నాడు. చిత్రావతి నదిలో ఈత కొట్టేందుకు ప్రయత్నించి నీట మునిగి మృతి చెందాడా? లేదా జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

'స్పందన'లో ఇస్కాన్ భోజనం



భోజనం పెడుతున్న ఇస్కాన్ ప్రతినిధి

అనంతపురం అర్బన్: సమస్యలు విన్నవించుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే వారి కోసం ఇస్కాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. వేసవి దృష్ట్యా మజ్జిగ సైతం ఏర్పాటు చేశారు. గతంలో ఇదే తరహాలో భోజనం అందించేవారు. అయితే కరోనా కారణంగా స్పందన కార్యక్రమాలు రద్దు కావడంతో ఈ ప్రక్రియను ఇస్కాన్ నిలిపివేసింది. ఆ తర్వాత స్పందన ప్రారంభమైనప్పటికీ ప్రజలకు భోజనం అందించే విషయంపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో గత స్పందనలో ఎస్సీ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు తక్షణమే స్పందించి ఇస్కాన్ ద్వారా ప్రజలకు భోజన సదుపాయం ఏర్పాటు చేయించారు.

పిడుగుపాటుకు గేదె మృతి



శెట్టూరు: మండలంలోని లింగదీర్లపల్లిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. పాడి రైతు శివన్న తన ఇంటి బయట గేదెను కట్టేసి రాత్రి ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి కురిసిన గాలీ వానకు పిడుగు పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి డాక్టర్ సాయిసుమన్ సోమవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని గేదె కళేబరానికి పోస్టు మార్టం నిర్వహించారు. ఘటనతో రూ.40 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

పాడి రైతుకు భరోసా

- పశువులు మరణిస్తే బీమా పరిహారం వర్తింపు
- పశువులకు రూ.30 వేలు, జీవాలకు రూ.6 వేల చొప్పున పరిహారం
- మూడేళ్ల కాలానికి లబ్ధిదారుల వాటా కింద 20 శాతం ప్రీమియం



పాడి పశువులు

అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు భరోసా ఇస్తూ జగన్ సర్కారు తాజాగా 'వైఎస్సార్ పశుబీమా పథకాన్ని' అమల్లోకి తెచ్చింది. వివిధ రకాల వ్యాధులు, ప్రమాదవశాత్తు పశువులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు లాంటి పశు, జీవసంపద మరణిస్తే... రైతులు, కాపర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా బీమా పథకాన్ని రూపొందించారు. లబ్ధిదారుల వాటా కింద కేవలం 20 శాతం ప్రీమియం చెల్లిస్తే... మూడేళ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. నెలలు, సంవత్సరాల పాటు కాలయాపన లేకుండా పశు, జీవ సంపద మరణించిన 21 రోజుల్లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ అయ్యేలా నిబంధన పెట్టారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల జమ కాకపోతే ఆ విషయాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచనున్నారు.

రకాన్ని బట్టి పరిహారం

సంకరజాతికి చెందిన పశువులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే... ఒక్కో దానికి రూ.30 వేలు చొప్పున పరిహారం ఇస్తారు. అలాగే దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే వాటికి రూ.15 వేల చొప్పున చెల్లించనున్నారు. గొర్రెలు, మేకలు మరణిస్తే... ఒక్కోదానికి రూ.6 వేల ప్రకారం ఇవ్వనున్నారు. ఒక్కో రైతు కుటుంబానికి బీమా కాలంలో ఐదు పశువులు లేదా గేదెలు లేదా ఎద్దులకు వర్తించనుండగా... 50 గొర్రెలు, మేకలకు వర్తిస్తుందని నిబంధన పెట్టారు. పాడి ఆవులు కనీసం ఒక ఈత ఈని ఉండాలి (2 నుంచి 10 సంవత్సరాలు), అలాగే పాడి గేదె కూడా ఒక ఈత ఈని ఉండాలి (3 నుంచి 12 సంవత్సరాలు), వ్యవసాయ ఎద్దులు సంకరజాతివి అయితే ఒకటిన్నర సంవత్సరం నంచి 10 సంవత్సరాలు, అలాగే దేశీయ జాతి ఎద్దులు అయితే 2 నుంచి 10 సంవత్సరాలు ఉన్నవి బీమా పథకానికి అర్హతగా నిర్దేశించారు. ఇక గొర్రెలు, మేకలు, పందులు అయితే ఆరు నెలలు వయస్సు దాటి వుండాలి. వయస్సును పశువైద్యులు ధ్రువీకరించనున్నారు. బీమా కింద నమోదయ్యే పశువులు, జీవాలకు చెవిపోగు వేస్తారు. దాన్ని బట్టి 21 రోజుల్లోపు బీమా కంపెనీల నుంచి పరిహారం ఇవ్వనున్నారు.

20 శాతం ప్రీమియం

ఎస్సీ ఎస్టీ, నిరుపేద లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం, ఇతరులు తమ వాటా కింద 50 శాతం ప్రీమియం చెల్లించాలి. ఎస్సీ ఎస్టీ రైతులతో పాటు నిరుపేద రైతులు సంకరజాతి పశువులకు మూడేళ్ల కాలానికి తమ వాటా కింద ఒక్కోదానికి రూ.384 ప్రీమియం కట్టాలి. అదే దేశీయ పశుజాతికి అయితే తమ వాటా కింద రూ.480 చెల్లించాలి. ఇతర రైతులైతే సంకరజాతి పశువులకు తమ వాటా కింద రూ.960 ప్రకారం చెల్లించాల్సి వుంటుంది. ఇక గొర్రెలు, మేకలు, పందులకు అయితే ఒక్కో దానికి ఎస్సీ ఎస్టీ, పేద వర్గాలు తమ వాటా కింద ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్ల బీమాకు రూ.75 ప్రకారం చెల్లించాలి. ఇతర వర్గాలు ఒక్కో దానికి ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ.135, మూడేళ్లకు రూ.187.50 ప్రకారం ప్రీమియం చెల్లించాలి. ఒకవేళ మరింత అధిక ధరకు బీమా చేయించుకోవాలకుంటే పశువు విలువను బట్టి ఎస్సీ ఎస్టీ, పేద వర్గాలు 7.68 శాతం, ఇతర వర్గాలు 9.6 శాతం ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. ఎక్కడికక్కడ పశువైద్యులు, పశుశాఖ అధికారులను సంప్రదించి బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

బీమా వర్తింపు ఇలా

- ప్రమాదవశాత్తు అంటే వరదలు, తుపానులు, విద్యుత్ షాక్, పాముకాటు, అడవి జంతువుల దాడి, మంటల్లో చిక్కుకున్నవి, రహదారులు, రైల్వే ప్రమాదాల కారణంగా మృతి చెందినవి అర్హత.
- ఏదైనా రోగాలు, జబ్బులతో మరణించినా బీమా పథకానికి అర్హతగా గుర్తించారు.
- యజమాని నిర్లక్ష్యం కారణంగా, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ (విపత్తులు వర్తించే పరిస్థితి ఉన్నపుడు), ఏదైనా ఇతర బీమా పథకాలు వర్తించినపుడు, దొంగతనాలకు, గుర్తింపు చెవిపోగు లేకుంటే బీమా పథకం వర్తించదు.

లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

- సిఫారసు చేసిన కలెక్టర్ గౌతమి
- ఒకే ఏడాదిలో 99 అబార్షన్లు
- వైద్యాధికారుల విచారణలో వెలుగుచూసిన వాస్తవాలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆమె సస్పెన్షన్‌కు కలెక్టర్ గౌతమి సిఫారసు చేశారు. ఇటీవల ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన గర్భిణి కవిత(25)కు అబార్షన్ చేసి, మృతికి కారణమైందన్న ఆరోపణల్లో వెల్లువెత్తిన నేపథ్యంలో దీనిపై 'అనంతలో దారుణం, చిదిమేస్తున్నారు, కదిలిన వైద్యురాలి అక్రమాల డొంక, అన్నీ అబద్ధాలే' తదితర శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, డెమో బృందం ఇటీవల అమ్మవారిపల్లి, చిగిచెర్ల గ్రామాలను సందర్శించి మృతురాలి కుటుంబీకులతో స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అంతేకాక ఘటనకు సంబంధించి డాక్టర్ లక్ష్మీకాంతమ్మ, రూత్ ఆస్పత్రిపై అనంతపురం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

99 మందికి అబార్షన్లు:

వైద్యాధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతుల్లేకుండానే అనంతపురంలోని శ్రీనివాస నగర్‌లో రూత్ ఆస్పత్రిని డాక్టర్ లక్ష్మీకాంతమ్మ నిర్వహిస్తోందని గుర్తించారు. అంతేకాక మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(అబార్షన్) చేయడానికి అనుమతులు లేకున్నా 2022 నుంచి ఇప్పటి వరకూ ఏకంగా 99 అబార్షన్లు చేసినట్లు (అభిజ్ఞ ఆస్పత్రిలో) బహిర్గతం కావడంతో విచారణాధికారులు విస్తుపోయారు. ఈ నేపథ్యంలో రూపొందించిన తుది నివేదికను సోమవారం కలెక్టర్‌కు సమర్పించారు. పరిశీలించిన కలెక్టర్ గౌతమి.. వెంటనే డాక్టర్ లక్ష్మీకాంతమ్మను సస్పెన్షన్‌కు సిఫారసు చేశారు. అయితే డాక్టర్ లక్ష్మీకాంతమ్మ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఉండడంతో కలెక్టర్ చేసిన సిఫారసుతో పాటు విచారణ నివేదికను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ద్వారా డీఎంఈకి చేర్చేలా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి చర్యలు తీసుకున్నారు.

చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తాం

ఎంటీపీ అనుమతులు తీసుకోకుండా అబార్షన్లు చేసిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై విచారణ కొనసాగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో అబార్షన్లు చేశారు. ఎంటీపీ చట్టాన్ని అతిక్రమించిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై చట్టపరమైన చర్యలకు ఆదేశిస్తాం.
– డాక్టర్ యుగంధర్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్

స్టేట్ బెస్ట్ బాక్సర్‌గా పవన్

విశాఖ స్పోర్ట్స్: అంతర జిల్లాల 6వ యూత్ మెన్ బాక్సింగ్ పోటీల్లో టీమ్ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. 14 పాయింట్లతో రన్నర్‌గా విజయనగరం జట్టు నిలిచింది. డీఆర్ఎం కప్ పేరిట రైల్వే బాక్సింగ్ హాల్‌లో 13 వెయిట్ కేటగిరిల్లో పోటీలు నిర్వహించారు. బెస్ట్ బాక్సర్‌గా బాంటమ్ వెయిట్‌లో వి.పవన్(అనంతపురం) నిలవగా... బెస్ట్ లూజర్‌గా బాంటమ్ వెయిట్‌లోనే బి.ప్రసాద్(విశాఖ) నిలిచాడు. అలాగే 54–57 కేజీల ఫెదర్ వెయిట్ కేటగిరిలో వై.హరీష్(అనంతపురం) తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఈ చాంపియన్‌షిప్‌లో ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన యూత్ బాక్సర్లు పోటీ పడగా.. ఆయా కేటగిరిల్లో విజేతగా నిలిచిన బాక్సర్లను ఏపీ యూత్ మెన్ జట్టుగా ఎంపిక చేసి త్వరలో జరగనున్న అంతర్రాష్ట్ర మెన్ యూత్ చాంపియన్‌షిప్‌కు అర్హత కల్పించనున్నారు. ఫైనల్‌లో లూజర్లు స్టాండ్‌బైగా నిలవనున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

సాహితీ మేరువుతో 'అనంత' అనుబంధం



కేతు విశ్వనాథరెడ్డి (ఫైల్)

అనంతపురం కల్చరల్: రాయలసీమ కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన తొలితరం కథకుడు కేతు విశ్వనాథరెడ్డి (84) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం ఈ లోకాన్ని వీడిపోయారు. 1939లో వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల మండలం, రంగసాయిపురంలో జన్మించిన ఆయన తొలి కథ 'అనాది రాళ్లు'. ఆ తర్వాత వెలువరించిన కథలు, నవలలు, వ్యాస సంపుటాలు ఆయనను రాయలసీమకంతటికీ సాహితీ ప్రతినిధిగా మార్చేశాయి. ఈ నేపథ్యంలో ఆయనతో అనంత ప్రసిద్ధ సాహితీవేత్తలందరికీ ప్రత్యేక అనుబంధం ఏర్పడింది.1993లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 2021లో వైఎస్సార్ స్మారక జీవిత సాఫల్య పురస్కారమందుకున్నారు. ఆయన మరణ వార్త అనంత సాహితీ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సీమ తొలితరం కథారచయితగా సాహిత్యానికి పరిపూర్ణమైన జవసత్వాలందించిన గొప్ప కథాశిల్పిగా కేతు విశ్వనాథ రెడ్డిని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ శాంతినారాయణ అభివర్ణించారు. కడప గ్రామ నామాల గ్రంథ పరిశోధనతో డాక్టరేట్ పొందిన కేతు విశ్వనాథరెడ్డి ప్రభావం ఇక్కడి వారందరిపై ఉందని డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అన్నారు. ఆధునిక వచనం, భాషా శాస్త్రపరంగా చేసిన కృషి ఆదర్శప్రాయంగా నిలిచిందని సాహితీ స్రవంతి ప్రతినిధులు డాక్టర్ ప్రగతి, పిళ్లా కుమారస్వామి అన్నారు. పాత్రికేయుడిగా, అధ్యాపకుడిగా, అంబేడ్కర్ యూనివర్సిటీ డైరెక్టర్‌గా ఆయన అందించిన సేవలు ఎనలేనివని అనంత జిరసం అధ్యక్షుడు సాకే శ్రీహరిమూర్తి, డాక్టర్ ఉమర్‌ఆలీషా సాహితీ సమితి అధ్యక్షుడు రియాజుద్దీన్, జిరసం అధ్యక్ష కార్యదర్శులు జన్నె ఆనంద్, కొత్తపల్లి సురేష్ పేర్కొన్నారు. విశాలాంధ్ర పుస్తక ప్రచురణ సంస్థతో కేత విశ్వనాథరెడ్డికి అనేక దశాబ్దాల అనుబంధం ఉందని సంస్థ మాజీ మేనేజర్ చెట్ల ఈరన్న తెలిపారు.

ఫ్యాక్షన్ రూపుమాపడమే లక్ష్యం

- నీచ రాజకీయాలు మాని ఇప్పటికైనా జేసీ చర్చకు రావాలి
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ఫ్యాక్షన్‌ను పూర్తిగా రూపుమాపాలన్నదే తన తపన అని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రి మండలంలో చేపట్టిన 3వ విడత ప్రజా సంక్షేమ యాత్ర 7వ రోజులో భాగంగా ఆయన సోమవారం హుసేనాపురం, బొందలదిన్నె, వంగనూరు గ్రామాల్లో పర్యటించారు. బొందలదిన్నెలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల సమగ్రాభివృద్ధిని ఆకాంక్షించి తాను పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరి చేరుస్తున్నామన్నారు. వ్యక్తిగత స్వలాభం కోసం గత పాలకులు గ్రామాల్లో ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోస్తూ వచ్చారన్నారు. వీని వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. అదే ఫ్యాక్షన్‌కు తన కుటుంబంలో ఒకరు బలయ్యారని, ఆ పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో తనకు తెలుసునన్నారు. అందుకే ఫ్యాక్షన్‌ను సమూలంగా రూపుమాపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అధికారులను తరచూ బెదిరిస్తూ, అనవసర రాద్ధాంతాలు చేసే జేసీ ప్రభాకర్‌రెడ్డి నీచ రాజకీయాలకు ఇప్పటికైనా స్వస్తి పలికి అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తలాతోక లేని అంశాలతో ధర్నాలు, నిరసనలతో ప్రజలకు ఒనగూరే లబ్ధి ఏమీ లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం గుడ్‌విల్ లేకుండానే తక్కువ ధరకు మున్సిపల్ షాపు రూములను వ్యాపారులకు అద్దెకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అదే జేసీ హయాంలో గుడ్‌విల్ రూపంలో దండుకున్న డబ్బులో సగం జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి చేరిందన్నారు.తాడిపత్రిలో డీజిల్ దొంగ ఎవరో అందరికీ తెలుసన్నారు. స్వర్శ స్వచ్ఛంద సంస్థ పేరిట తిరుగాడే వాహనాలకు డీజిల్ ఏ డబ్బుతో పోసుకున్నారో, వాటి ద్వారా సొంత పనులు ఏ విధంగా చేసుకున్నారన్న విషయాలు ప్రజలకు తెలుసన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తనయుడు అస్మిత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పెన్నా నూతన బ్రిడ్జి వద్ద మున్సిపల్ పార్కులోని క్రీడా పరికరాలను తీసుకుపోయి, మరలా మున్సిపల్ చైర్మన్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎంపిక కాగానే ఆ పరికరాలను మరలా పార్కులో ఏర్పాటు చేసిన మహాఘనుడని ఎద్దేవా చేశారు. వార్డుల్లో తాగునీటి సరఫరాను ఆపింది తెదేపా కౌన్సిలర్లేనని, ప్రజల సమస్యను వారి దృష్టికి తేగానే మరలా సమస్య పరిష్కరిస్తున్నట్లు నీటి సరఫరా పునరుద్ధరించి నాటకాలు ఆడుతున్నారన్నారు. అభివృద్ధికి ముందుకు వచ్చినా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడని, ఇప్పటికైనా నీచ రాజకీయాలు మాని చర్చకు కలసి రావాలని పిలుపునిచ్చారు.

మైనర్లకు కౌన్సిలింగ్

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: పుట్లూరు మండలంలో ఇటీవల ఇద్దరు మైనర్లు పెళ్లి చేసుకున్న ఘటనపై 'పదిలోనే ఏడడుగులు' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. తాడిపత్రి ఐసీడీయస్ సీడీపీఓ సాజిదాబేగం, సూపర్‌వైజర్ విజయలక్ష్మి సోమవారం ఉదయం మైనర్ల ఇంటి కెళ్లి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎవరి ఇళ్లకు వారిని పంపారు. ఇరువైపులా తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ఏదైనా గుట్టుచప్పుడు కాకుండా చేయాలనుకుంటే చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఉదయం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌కు ఇరువైపులా పెద్దలతో పాటు మైనర్లనూ పిలిపించి తహసీల్దారు రమాదేవి, ఎస్ఐ రామకృష్ణ, ఐసీడీయస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు.

పనులు పూర్తయిన వెంటనే బిల్లులు

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు గుర్తించిన అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి డబ్బు జమ చేస్తున్నామని పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ) రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 92 పనులు మంజూరు చేయగా, ఇప్పటి వరకూ 24 పనులు పూర్తయ్యాయన్నారు. వీటికి సంబంధించి రూ.72 లక్షలు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేసి, నిధులు విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

గండి పూడ్చివేతలో ఉదాసీనత



వృథాగా పోతున్న నీరు

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరవాని తిప్ప పంచాయతీ పోలేపల్లి సమీపంలో సైఫన్ వద్ద గత వారం బీటీపీ కాలువకు పడిన గండిని పూడ్చడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఫలితంగా నీటి ప్రవాహానికి కట్ట కోతకు గురై గండి పెద్దదిగా మారింది. వారం రోజుల క్రితమే గండి పడినప్పుడు విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని ఈ సందర్భంగా స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

'ఓపెన్' పరీక్ష ఫలితాల విడుదల

రాప్తాడురూరల్: ఈ ఏడాది ఏప్రిల్‌లో సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్‌స్కూల్) ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ తెలిపారు. జిల్లాలో పదోతరగతిలో మొత్తం 1,192 మందికి గాను 699 మంది (58.64 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో 2,723 మందికి గాను 1,625 మంది (59.68 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ (జవాబుపత్రం జిరాక్స్) కోసం ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. జవాబు పత్రి రీకౌంటింగ్ పదో తరగతి, ఇంటర్ ఒక్కో సబ్జెక్టుకు రూ.200, రీ వెరిఫికేషన్ (జవాబుపత్రం జిరాక్స్) పదో తరగతి, ఇంటర్ ఒక్కో సబ్జెక్టుకు రూ. 1000 చొప్పున ఏపీ ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 26 నుంచి జూలై 4వ తేదీ వరకు జరుగుతాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూలై 5, 6, 7 తేదీల్లో ఉంటాయి. సప్లిమెంటరీ పరీక్షల ఫీజు జూన్ 2వ తేదీలోపు చెల్లించాలి.

సజావుగా అగ్రి, ఫార్మసీ ప్రవేశ పరీక్ష

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్–2023లో భాగంగా అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి పరీక్ష సోమవారం ప్రారంభమైనట్లు సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన తెలిపారు. తొలిరోజు మొత్తం 48,622 మంది విద్యార్థులకు గాను, 43,929 (90.35 శాతం) మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లోను పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

అరటి రైతులను ఆదుకోవాలి

- శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌ను కోరిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పంట నష్టం గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: గాలీవానతో అరటి తోటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన కనగానపల్లి మండల రైతులను ఆదుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ, ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు చాలా పంటలు దెబ్బతిన్నాయన్నారు. కనగానపల్లి మండలంలోని బద్దలాపుర గ్రామానికి చెందిన రైతులు చంద్రాయుడు, కృష్ణారెడ్డి, నాగరాజు తదితర రైతులకు చెందిన సుమారు 300 ఎకరాల్లోని అరటి తోటలు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు వర్షిణి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మ్యూజిక్‌పై మమకారాన్ని చంపుకోలేక ఓ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కొత్త చెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన నరసింహమూర్తి, జ్యోతి దంపతుల కుమార్తె వర్షిని (19)... అనంతపురంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజుల క్రితం సెలవులుండటంతో సొంతూరుకు వెళ్లి తిరిగి సోమవారం మధ్యాహ్నం 11.30 గంటలకు హాస్టల్‌కు చేరుకుంది. ఏం జరిగిందో తెలియదుగాని హాస్టల్‌లోని తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గుర్తించిన తోటి మిత్రుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. మ్యూజిక్ అంటే వర్షిణికి చాలా ఆసక్తి అని, అయితే మ్యూజిక్‌తో భవిష్యత్తు ఉండదని, బుద్ధిగా చదువుకోవాలని తల్లిదండ్రులు హితవు పలికినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ కారణంగానే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేశామని, వారు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సివిక్స్, ఎకనామిక్స్ తరగతుల బోధనకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడురూరల్: 'అప్‌గ్రేడ్ హైస్కూల్ ప్లస్'లో సివిక్స్, ఎకనామిక్స్ తరగతుల బోధనకు (పీజీటీ పోస్టు) ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ సాయిరామ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం ఉత్తీర్ణత, బీఈడీలో మెథడాలజీ సబ్జెక్టు ఉన్న వారు అర్హులు. ఆసక్తి గల ఉన్న వారు ఈ నెల 24 సాయంత్రం 5 గంటల్లోపు డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి.

మందు గుండు పేలి ఆవుకు గాయాలు



కంబదూరు: స్థానిక పురాతన మల్లేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో మందు గుండు సామగ్రి పేలి ఓ ఆవు తీవ్రంగా గాయపడింది. సోమవారం ఉదయం కంబదూరుకు చెందిన రైతు కట్టా వెంకటేశులు తన ఆవులను మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలోకి మేపునకు వదిలాడు. ఓ మేత మేస్తుండగా ఒక్కసారిగా మందు గుండు పేలింది. దీంతో నోరు ఛిద్రమైంది. కాగా, ఆదివారం రైతు జూల భీమసేనప్పకు చెందిన గేదె సైతం మందుగుండు పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడింది. వరుసగా రెండు రోజుల్లో మందు గుండు పేలుడు ఘటనల్లో రెండు మూగజీవాలు తీవ్రంగా గాయపడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, మరో రెండు మందు గుండ్లను స్వాధీనం చేసుకున్నారు. అడవి పందులను వేటాడేందుకు కొందరు వీటిని అమర్చినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

పోలీసు 'స్పందన'కు 125 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 125 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కాగా, ఓ కేసు విషయంగా తరచూ తనను పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తున్నారంటూ బాధితుడు చేసిన ఫిర్యాదుపై ఎస్పీ తక్షణమే స్పందించారు. ఇందుకు సంబంధించి అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డిని ఆరా తీశారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని ఆయన తెలపడంతో వెంటనే సంబంధిత కానిస్టేబుల్ మోహన్‌ను పిలిపించుకుని సీఐ దృష్టికి తీసుకెళ్లకుండా కేసులను ఎలా హ్యాండిల్ చేస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్‌కు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ

రాప్తాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని హెల్త్ సూపర్ వైజర్ లక్ష్మీ నరసమ్మ తెలిపారు. సోమవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో బాల్యవివాహాలు, లింగ నిర్ధారణ చట్టం ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను తెలియజేశారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లలోపు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచు సాకే తిరుపాలు, ఏఎన్ఎం లీలావతి, ఆశా కార్యకర్తలు గాయిత్రి, చంద్రకళ, మహిళ సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌రెడ్డికి సీపీఎం నివాళి

అనంతపురం అర్బన్: కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథ్‌రెడ్డి మృతికి సీపీఎం జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటించినట్లు జిల్లా కార్యదర్శి రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ జనజీవితాన్ని అద్భుతంగా తన కథల్లో మలిచిన గొప్ప రచయిత విశ్వానాథ్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన పలు రచనలు, పరిశోధనలు చేసి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారని, ఆయన మరణం తీరని లోటని అన్నారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

అనంతపురం అర్బన్: ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుక్కెళ్లేందుకు ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం గౌవరాధ్యక్షురాలు సావిత్రి, కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడారు. ఉపాధి చట్టంలో కొత్త మార్పులతో కూలీలకు నష్టం జరుగుతోందన్నారు. పలురకాల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుక్కెళ్లేందుకు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు సూరి, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, కరీమ్, సహాయ కార్యదర్శులు భాస్కర్, నాగప్ప, పెద్దయ్య, మల్లేష్, మున్ని పాల్గొన్నారు.

గాలీవానకు నేలకొరిగిన బీర పంట



నష్టపోయిన బీర పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల ఎగువతండాకు చెందిన సేవేనాయక్ అనే రైతులకు చెందిన నాలుగెకరాల్లో సాగు చేసిన బీర పంట ఆదివారం రాత్రి ఈదురుగాలులు, వర్షానికి దెబ్బతినింది. నాలుగు ఎకరాల్లో పంట సాగుకు రూ.6 లక్షలు అయ్యిందని, పంట చేతికి వచ్చిందిన అంతలోనే ఇంత నష్టం జరిగిందని రైతు వాపోయాడు. మండల వ్యవసాయాధికారిణి అధికారి చందన పంటను పరిశీలించారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేస్తాం



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌కో అధికారులు

రాప్తాడు: మండలంలో విద్యుత్ అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేస్తామని అనంతపురం రూరల్ డివిజన్ ఈఈ గోపీ, డీఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఈ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి భారీగా వీచిన ఈదురు గాలులకు ధర్మవరం నుంచి హంపాపురం సబ్‌స్టేషన్‌కు వచ్చే 33 కేవీ లైన్ ఫీడర్‌లో సుమారుగా 22 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. మండలంలో మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. బుక్కరాయసముద్రం నుంచి సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా చేయడం జరిగిందన్నారు. 11 కేవీ మరూరు, గొల్లపల్లి, ఎం.చెర్లోపల్లి, జలబిందు ఫీడర్లలో 45 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయన్నారు. మరూరు, పాలబావి, గొల్లపల్లి గ్రామాల్లో దాదాపుగా 10 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ కిందకు పడిపోయి మరమ్మతులకు గురయ్యాయన్నారు.

దారి దాపునకు పదరా..వానరా..!

సూరీడు సుర్రుమంటున్నాడు.. ఇంట్లో ఉంటే ఉక్కపోత.. బయటకెళ్తే భగ భగ మండే ఎండ.. మాడు మాడుతోంది.. నిప్పుల కుంపటిలా నేల మండుతోంది.. బయటకు అడుగేయాలంటే ఆలోచించే పరిస్థితి.. జనమైనా..జీవమైనా ఒకటే.. చెట్టునీడకెళ్లి చల్లనిగాలిలో సేదతీరాలనుంటుంది.. ప్రయాణమంటే సాహసమే.. బస్సులో వెళ్లినా, బైకుపై వెళ్లినా వేడిగాలికి వడదెబ్బ తగులుతుందేమోనని భయం.. అనంతపురం - తాడిపత్రి రహదారి పొడవునా ఎత్తైన పచ్చని చెట్లు.. ఇక ప్రాణానికి ప్రమాదమేముంటుంది..? రేయి అయినా.. పగలైనా ప్రయాణం సురక్షితమే.. ఆహ్లాదకరమైన గాలిని ఆస్వాదిస్తూ గమ్యస్థానాలకు హాయిగా చేరొచ్చు. పచ్చని దారిదాపునకు వెళ్దాం పదరా.. అంటూ వానరాలు పరుగులు తీస్తుంటే.. ఆహ్లాకరమైన దృశ్యాలు ఇలా సాక్షాత్కారమయ్యాయి..

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



ప్రయాణం.. పచ్చదనమే



పరుగే పరుగు: నీడ కోసం రోడ్డు దాటుతున్న వానరాలు



దా..దా..ఇటురా..: ఎండకు తాళలేక చెట్ల కింద గోడపైన సేద తీరుతున్న వానరాలు



మండిపోతాంది మామా.. షెడ్డునీడకు పరుగు తీస్తున్న వానరాలు

నాల్గో పట్టణ సీఐగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ప్రతాప్‌రెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాల్గో పట్టణ సీఐగా ఆర్.ప్రతాప్‌రెడ్డి సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతరం ఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లా పులిచర్లకు చెందిన ప్రతాప్‌రెడ్డి 2002లో ఎస్ఐగా ఉద్యోగంలో చేరారు. 2011లో సీఐగా ఆయన పదోన్నతి పొంది, ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల పని చేశారు. ఏసీబీలో కూడా సీఐగా కొనసాగారు. అనంతపురం టూటౌన్ ఎస్ఐగా, వన్‌టౌన్ సీఐగా పనిచేశారు. తాజాగా నాల్గో పట్టణ సీఐ జాకీర్ హుసేన్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో ప్రతాప్‌రెడ్డిని నియమించారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారని అన్నారు. కార్యక్రమానికి మండలంలోని వలంటీర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు.

అరటి రైతులను ఆదుకుంటాం



బద్దలాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి తోటల రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బద్దలాపురంలో ఎమ్మెల్యే పర్యటించి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడారు. ఆయన అధికారులతో కలసి అరటి రైతులు చంద్రాయుడు, చిన్నకృష్ణారెడ్డి, నాగరాజు పొలాలకు పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ విపరీతమైన ఈదురు గాలుల వల్ల గెలలతో ఉన్న అరటి తోటలు నేలకూలాయన్నారు. దీంతో ఎకరానికి రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు నష్టపోయామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా అందిస్తోందన్నారు. జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో సాగుచేసే అరటి పంటకు ప్రభుత్వం ఇంకా పంటల బీమా పథకాన్ని అమలు చేయలేదని హార్టికల్చర్ అధికారులు చెప్తున్నారన్నారు. దీనిపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వం దృష్టికి వెంటనే తీసుకెళ్లి, బాధిత రైతులకు పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీఈ చంద్రశేఖర్, హెచ్ఓ అమరేశ్వరీ, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర ప్రజలకు మేయర్ వసీం తెలిపారు. సోమవారం నగరంలోని 43, 46, 48 డివిజన్లలో మేయర్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాలువల్లో ప్లాస్టిక్, తదితర వ్యర్థాలను వేయకూడదన్నారు. చెత్తను వేరు చేసి క్లాప్ ఆటోలకు అందించాలన్నారు. అనంతరం పూడికతీత పనులు చేపట్టాలని ఆయన ఇంజినీర్లను ఆదేశించారు. ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు ఇస్హాక్, శ్రీనివాసులు, నాయకులు ఖాజా, దాదు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మనుగడ



మాట్లాడుతున్న ఏడీఎఫ్ఓ దామోదర్‌రెడ్డి

అనంతపురం రూరల్: పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని జిల్లా అసిస్టెంట్ అటవీశాఖ అధికారి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పీవీకేకే డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏడీఎఫ్ఓ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడితేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముని కృష్ణారెడ్డి, కళాశాల సిబ్బంది. సురేష్‌బాబు, కేశవయ్య, సాధిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆత్మకూరు వాసులు

ఆత్మకూరు: పొలిమేర పెద్దమ్మ విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఆత్మకూరు గ్రామస్తులు ఆహ్వానించారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జూన్ 2వతేదీ వరకు విగ్రహ ప్రతిష్ట ఉంటుందని తెలిపారు.

అన్నదాతలకు ప్రభుత్వం అండ



అరటి రైతులతో మాట్లాడుతున్న చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి

రాప్తాడు: ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలో ఆదివారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. గొల్లపల్లి, మరూరు, పాలచ్లె గ్రామాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. కోతకు వచ్చిన చీనీ కాయలు రాలిపోయాయి. వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆయా గ్రామాల్లో నేలకొరిగిన అరటి పంట, చీనీ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, సర్పంచు హన్మంతు రెడ్డి, ఉద్యాన, వ్యవశాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన ఎమ్మెల్యే

రాప్తాడు: మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. మండలంలోని చాపట్ల గ్రామంలో విద్యుత్ స్తంభాలు, రోడ్డుకు ఇరువైపులా పెద్ద వృక్షాలు నేలకొరిగిన విషయం తెలిసిందే. చాపట్ల రోడ్డుపై దాదాపుగా 30 పెద్ద వృక్షాలు నెలకొరిగి అడ్డంగా పడ్డాయి. దీంతో గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి ద్వారా సమస్య పరిష్కరింపజేశారు. ఎంపీపీ భర్త యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి చాపట్లకు చేరుకొని జేసీబీతో రోడ్డుకు అడ్డంగా ఉన్న పెద్ద వృక్షాలను తొలగింపజేశారు.

సీఎంపై నోరు జారితే తరిమికొడతాం

- ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యుడు పెన్నోబులేసు

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరుజారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తరిమికొడతామని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యుడు పెన్నోబులేసు హెచ్చరించారు. సంక్షేమ విప్లవం తీసుకొచ్చి పేదల ఆర్థిక ప్రగతి, పిల్లల ఉన్నత భవిష్యత్తుకు పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శించే స్థాయి ఎవరికీ లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై జనసేన నాయకుడు జయరామిరెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ పెన్నోబులేసు పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ సీఎం అందించని సుపరిపాలనను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తుంటే.. జనసేన నాయకులు ఇలా మాట్లాడడం సరికాదన్నారు. న్యాయవాది వృత్తిలో ఉంటూ చౌకబారుగా వ్యవహరించిన జయరామిరెడ్డిపై బార్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కే విలువలు లేవని, అలాంటప్పుడు కిందిస్థాయి చోటా నాయకులకు ఎక్కడుంటాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గోగుల పుల్లయ్య, యువజన విభాగం జిల్లా కార్యదర్శి గోగుల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ రమాబాయి



సర్జికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమాబాయి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ రమాబాయి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సర్జికల్ విభాగాధిపతి డాక్టర్ రామస్వామినాయక్ వద్ద ఆమె రిపోర్టు చేసుకున్నారు. కర్నూలు సర్వజనాస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న ఈమెకు ఇటీవల అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది.

మరో ముగ్గురికి పదోన్నతి: ఆప్తమాలజీ విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతకు అసోసియేట్‌గా పదోన్నతి లభించింది. ప్రస్తుతం ఈమె జీజీహెచ్‌లోనే పని చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆప్తమాలజీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నివేదితకు అసోసియేట్‌గా పదోన్నతి లభించింది. అనంతపురం జీజీహెచ్‌లోని ఆర్థో విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌస్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సూచించారు. నగరంలో సుభాష్ రోడ్డు ప్రధాన రహదారి అయినందున ట్రాఫిక్ సమస్యలేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ స్తంభిస్తే కలిగే ఇబ్బందులపై వివరిస్తూ చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్‌తో పాటు ఎస్ఐ వంశీకృష్ణ సిబ్బందితో కలిసి సుభాష్ రోడ్డుకు ఇరువైపులా రాంగ్ పార్కింగ్ లేకుండా చూశారు. పార్కింగ్ విషయంలో దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆటో డ్రైవర్లకు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఆటోలు ప్రధానంగా స్టాండ్‌లో పార్కింగ్ చేయాలని సూచించారు.

మహిళా ఉద్యోగుల రక్షణకు చర్యలు



జోనల్ చైర్‌పర్సన్ మంజులను సన్మానిస్తున్న కర్నూలు జిల్లా మహిళా నాయకులు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీలో మహిళా ఉద్యోగుల రక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల తెలిపారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగుల రక్షణకు ఇటీవల లైంగిక వేధింపుల నిరోధక కమిటీని ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్‌గా జోనల్ చైర్‌పర్సన్ మంజులను ఎన్నిక చేయడంపై కర్నూలు జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అధ్యక్షుడు నాగన్న, మహిళా ఉద్యోగులు ఆర్టీసీ డిపోలో సోమవారం జోనల్ చైర్ పర్సన్‌ను కలిసి సన్మానించారు. జోనల్ పరిధిలో మహిళా ఉద్యోగులకు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలోనే జిల్లాల పర్యటన చేపడుతామని, ప్రత్యేకంగా మహిళా ఉద్యోగుల సమస్యలపైనే చర్చించనున్నట్లు తెలిపారు.

ఇనిసెట్ ర్యాంకర్‌ను అభినందించిన ప్రిన్సిపాల్



డాక్టర్ సంధ్యప్రియను అభినందిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం క్రైం: స్థానిక వైద్య కళాశాలలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రెన్స్ టెస్ట్- ఇనిసెట్)లో 351వ ర్యాంక్ సాధించిన (వైద్య కళాశాల 2కె16 విద్యార్థిని) డాక్టర్ సంధ్యప్రియను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి సోమవారం అభినందించారు. ఇటీవల విడుదలైన ఇనిసెట్ ఫలితాల్లో (పీజీ) ఆలిండియాలో డాక్టర్ సంధ్యప్రియ ఈ ఘనత సాధించారు. పీజీ పూర్తి చేసి, పేదలకు మెరుగైన సేవలు అందించాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి డాక్టర్ సంధ్యప్రియకు సూచించారు. పీడియాట్రిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి, భవిష్యత్‌లో నెలలో రెండు, మూడు రోజుల పాటు పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తామని డాక్టర్ సంధ్యప్రియత ఎలిపారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొఫెసర్ డాక్టర్ మల్లీశ్వరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, దామోదర్, సంధ్యప్రియ తల్లిదండ్రులు శివపార్వతి, సతీష్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఔత్సాహికులను ప్రోత్సహించడానికే పోటీలు

అనంతపురం కల్చరల్: ఔత్సాహికులను ప్రోత్సహించడానికి సినిమా పాటల డాన్సు పోటీలు నిర్వహిస్తున్నట్లు అనంత డాన్సర్స్ క్లబ్ అధ్యక్షుడు సపారె రాజశేఖర్, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, కత్తి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కృష్ణ కళామందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంత డాన్సర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'అనంత సూపర్ డాన్సర్-23' పేరిట సినిమా పాటల డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, సోలో, డ్యూయెట్, , గ్రూప్ విభాగాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 27లోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9290200675 లో సంప్రదించాలని కోరారు.

ఖురాన్ పఠనంతో జీవితాల్లో వెలుగు

అనంతపురం సిటీ: ఖురాన్ పఠనంతో ముస్లింల జీవితాల్లో వెలుగునిండుతుందని నగర మేయర్ వసీం, వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. అనంతపురం వినాయకనగర్‌లోని మదరసా ఏదారుత్ తౌహిద్ మస్జీదులో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఫ్తీ మమహ్మద్ సమీవుల్లా విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పేదలపై భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలు

కనగానపల్లి: పేదలపై భారం పడకుండా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపడుతోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన జగనన్న కాలనీల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు స్థలాన్ని అందించి ఉచితంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. తద్వారా పేదలపై ఎలాంటి భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరక్టర్ ప్రభాకర్, హౌసింగ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తలారి ప్రదీప్‌కుమార్‌కు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. బద్దలాపురం గ్రామానికి చెందిన తలారి ప్రదీప్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. సోమవారం మండల ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ఆర్థిక సాయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, సురేష్, దినేష్‌రెడ్డి, నరసింహులు, చంద్రాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిలేదీక్ష

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రిలే దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు అక్టోబర్ 31 వరకు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రాము నాయక్, మహిళ అధ్యక్షులు సాంబశివమ్మ, అసోసియేట్ అధ్యక్షుడు రమణకుమార్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
మంగళవారం ॥ 23-5-2023

గృహిణిగా ఇంటి బాధ్యతలు మహిళలకు ఎలాగూ తప్పదు. ఇక ఆదాయ మార్గం గురించి ఆలోచించడం, వాటిని అమలులో పెట్టడం అంటే తగిన వనరులే కాదు ఇంటిల్లిపాదీ అందుకు సహకరించాలి. హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో ఉంటున్న ఆర్.రాజేశ్వరి ని కలిసినప్పుడు 'పదేళ్లుగా చేస్తున్న పచ్చళ్లు, పొడుల వ్యాపారం... ఆదాయంతో పాటు బిజినెస్ ఉమన్‌గానూ గుర్తింపును తెచ్చిపెట్టింది' అని వివరించింది.

కాదేదీ ఉపాధికనర్హం!

ఇంటి పచ్చళ్లతో ఇల్లు దిద్దుకుంది



● రాజేశ్వరి



'మన ఇళ్లల్లో అన్ని కాలాల్లోనూ ఏవో ఒక పచ్చళ్లు పెట్టడం అనేది గృహిణులకు అలవాటైన పనే. ఇంట్లో నేనూ అలాగే చేస్తుండే దాన్ని. నా చేతి పచ్చళ్లు రుచికరంగా ఉంటాయని ఇంట్లోనూ, బంధుమిత్రులు, చుట్టుపక్కల వాళ్లు బాగా మెచ్చుకునేవారు. అడిగి మరీ చేయించుకునేవారు. దీనికి తోడు నాకు తెలిసిన వాళ్లు విదేశాలకు వెళ్లినప్పుడు తమకు నచ్చిన పచ్చడి, పొడులు తయారు చేసిమ్మని అడిగేవారు.

పదేళ్ల క్రితం...

నోటి మాటతోనే ఒకరొకరుగా పచ్చళ్లు చేసిమ్మని అడిగే వారి సంఖ్య పెరగడం మొదలయ్యింది. దీనినే చిన్న వ్యాపారంగా మార్చుకుంటే బాగుంటుంది కదా అనుకున్నాను. మా ఊరు గుంటూరుకు వెళ్లినప్పుడల్లా అక్కడ రైతుల దగ్గరకు వెళ్లి, కావల్సిన సరుకులను నేరుగా పొలాల నుంచే సేకరించేదాన్ని. ఒకటే నియమం పెట్టుకున్నాను. కేవలం వెజ్ పచ్చళ్లను మాత్రమే పెట్టాలి. అలాగే, రసాయనిక ఎరువు వాడకుండా పండించిన ఆర్గానిక్ పంటల నుంచే సేకరించాలనుకున్నాను. నేరుగా రైతులను కలిసి, వారి ద్వారా పంటలను కొనుగోలు చేయడం, వాటిని బాగుచేయించి, తీసుకురావడమూ పెరిగింది. మిర్చి, పసుపు, మసాలా దినుసులు వంటివి ఏయే ప్రాంతాల్లో ఏయే ఏవి అధికంగా పండుతాయో తెలుసుకుని, ఆ దినుసులను సేకరిస్తూ ఉంటాను.

ఒక్కరిగానే...

మొదట్లో ఒక్కదాన్నే పచ్చళ్లకు అవసరమైనవన్నీ ఏర్పాటు చేసుకునే దాన్ని. అందుకు తగిన పనుల ప్లానింగ్ కూడా చేసుకున్నాను. మెల్లగా మార్కెట్ పెరుగుతుండటంతో సాయానికి మరొకరిని నియమించుకుని, పనులు చేస్తూ వచ్చాను. కామాక్షి ఫుడ్స్ పేరుతో పదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని రిజిస్టర్ చేయించుకొని, ఇప్పుడు నాతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. మొదట్లో అంతగా తెలియకపోయినా మార్కెట్ గురించి నాకు నేనుగానే ఓ అంచనా వేసుకుంటూ షాప్స్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్ల ద్వారానూ పచ్చళ్లు సిద్ధం చేస్తుంటాను. టొమాటో, గోంగూర, మాగాయ, నిమ్మకాయ, చింతకాయ.. వంటి పచ్చళ్లు, పొడుల తయారీ రోజూ ఉంటుంది.

రోజూ ఉదయం నాలుగు గంటల నుంచే మొదలయ్యే నా దినచర్య తిరిగి, రాత్రి పదిగంటలకే పూర్తవుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. మా వారు ఉద్యోగి. ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. ఏడాదికి ఇరవై లక్షల ఆదాయంతో ఈ మార్గం నాలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. నా చేత్తో నలుగురికి రుచికరమైన పచ్చళ్లను అందివ్వడమే కాదు, నాతో పాటు ఇంకొందరికి ఉపాధినివ్వడం సంతోషంగా ఉంది. ఆర్డర్లను బట్టి తయారీ విధానాన్ని ఎంచుకుంటాను కాబట్టి నష్టం అనే సమస్య ఎప్పుడూ రాలేదు. చేసే పనిలో ముందుగానే అంచనా ఉంటే అది ఉద్యోగమైనా, వ్యాపారమైనా ఇంటితోపాటు సమర్థవంతంగా నిర్వర్తించే సత్తా మహిళలకెలాగూ ఉంటుంది' అని వివరిస్తుంది రాజేశ్వరి.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

న్యూస్‌మేకర్స్

నానమ్మ హ్హా.. మనవరాలు హ్హా...



● గీతా గోదరా, ఆష్కా

మనవరాలు కరాటే చేస్తుంటే నానమ్మ తోడుగా నిలబడి చూడటం ఆనవాయితీ. కాని నానమ్మ కూడా కరాటే డ్రస్సు తొడుక్కుని గోదాలో దిగితే? గుర్‌గావ్‌కు చెందిన 60 ఏళ్ల గీతా గోదరా ఆమె 13 ఏళ్ల మనవరాలు ఆష్కా గోదరా దుబాయ్‌లో తాజాగా జరిగిన కరాటే ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించారు. ఈ కాలపు నానమ్మ–మనవరాలు ఇలాగే ఉండాలని అందరూ మెచ్చుకుంటున్నారు.

గుర్‌గావ్‌లోని సెక్టార్ 5లో రెండేళ్ల క్రితం మనవరాలికి తోడుగా కరాటే అకాడెమీకి బయలుదేరిన గీతా గోదరా ఇదంతా ఇంత వేగంగా జరుగుతుందని అనుకోలేదు. తాను కూడా కరాటే ఛాంపియన్ అవుతానని అసలు అనుకోలేదు.

'నేను పుట్టింది హర్యానాలోని పల్లెటూళ్లో. నా చదువు ఐదవ క్లాసుతో ముగిసిపోయింది. చిన్నప్పటి నుంచి సాహస కార్యాలు చేయాలని ఉండేది. ఒక వయసులో సైన్యంలో చేరాలని అనుకున్నాను. ఏవీ జరగలేదు. సంసారంలో పడ్డాను. నా మనవరాలు ఆష్కాకు నేను అసంపూర్తిగా వదిలేసిన కలలు నెరవేర్చుకునే వీలు ఉంది. అందుకని తను ఏం కోరినా సపోర్ట్ చేయాలనుకున్నాను. కరాటే నేర్చుకుంటానంది. నేను తోడుగా వెళ్లడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.

ఆమె ఇటీవల దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ (బుడోకాన్ కప్)లో 83 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. 22 దేశాల నుంచి ఈ పోటీల్లో కరాటేలో పాల్గొంటే వారిలో మన దేశం నుంచి 30 మంది ఉన్నారు. ఇంత మందిలో గీతా గోదరా మెడల్ సాధించింది.

'రోజూ నా మనవరాలు చేస్తున్న సాధన చూస్తే నాక్కూడా కరాటే నేర్చుకోవాలనిపించింది. ట్రైనర్ సునీల్‌ను అడిగాను– నా వయసు వారు నేర్చుకోవచ్చా అని. ఏ వయసు వారైనా నేర్చుకోవచ్చు... ఆసక్తి ఉండటమే ప్రధానం అని చెప్పాడు. వెంటనే నేను కూడా నేర్చుకోవడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.



● గీతా గోదరా

కాని ఈ పరిస్థితి మనవరాలు ఆష్కాకు ఇబ్బంది తెచ్చి పెట్టింది. 'నాతో పాటుగా మా నాయనమ్మ కూడా కరాటే ప్రాక్టీసు చేస్తుంటే నా స్నేహితులు ఆట పట్టించారు. నేను కూడా మా నాయనమ్మ ఇది చేయకపోతే బాగుండు అనుకున్నాను. కాని అకాడెమీలో ఆమె అన్ని ఎక్సర్‌సైజులను చాలా బాగా చేస్తుంది. పంచ్ గట్టిగా విసురుతుంది. ఆమెలో బలం చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు మెడల్స్ తెస్తుండటంతో గర్వపడుతున్నాను' అంది ఆష్కా.

'కరాటే మనసును, శరీరాన్ని ఒక తూగులో ఉంచుతాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. ఆత్మస్థయిర్యాన్ని కూడా ఇస్తాయి. ఇలాంటి ఒక వ్యాపకం ఉండటం స్త్రీలకు అవసరం' అంటోంది గీతా గోదరా.

స్త్రీలకు ఆత్మరక్షణ విద్యలు తప్పనిసరి అనిపిస్తున్న ఈ రోజుల్లో ఈ నానమ్మ, మనవరాలు ఇస్తున్న సందేశంతో స్ఫూర్తి పొందాల్సిందే.

బ్యూటిప్

జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే...



కప్పు పెసరపప్పును ఉడికించి మెత్తగా పేస్ట్ చేసి అందులో కోడిగుడ్డు సొన (పసుపు– తెలుపు మొత్తంగా), టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి రెండు గంటల తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. వారానికోసారి ఈ మూంగ్‌దాల్ హెయిర్ ప్యాక్ వేస్తే జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతూ, ఒత్తుగా పెరుగుతుంది.

గమనిక: ప్రతిరోజూ నానబెట్టి గ్రైండ్ చేయడం సాధ్యం కాకపోతే పెసలను మరపట్టించి పిండిని నిల్వ చేసుకుని రోజూ వాడుకోవచ్చు. తాజాగా నానబెట్టి గ్రైండ్ చేస్తే పెసరలోని పోషకాలు త్వరగా చర్మానికి అందుతాయి.

సాగుబడి
రోహిణీ కార్తె : మే 25 నుంచి

5న ప్రకృతి రైతుల మహా సమ్మేళనం

జూన్ 5(సోమవారం)న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రకృతి రైతుల మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో ఉ. 10 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుంది. పొలాన్ని అమ్మే వ్యవసాయం మానేద్దాం పొలాన్ని కొనుగోలు చేసే వ్యవసాయాన్నే చేద్దాం అనే నినాదంతో ఈ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత కుమారస్వామి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 10 వేల మంది రైతులు, వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అందరూ ఆహ్వానితులే.

సాగు మారితే జీవవైవిధ్యం భద్రం!



కర్నూలు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కనిపించిన పక్షి గూడు

రసాయనాల మయమైపోయిన వ్యవసాయ పద్ధతిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటే భూతాపాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పుల్ని పంటలు దీటుగా తట్టుకొని మంచి దిగుబడులు ఇవ్వడానికి అవకాశం ఉందన్నది తెలిసిందే. అదే విధంగా.. ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తే పంటల్లో వైవిధ్యత పెరుగుతుంది. పక్షులు తదితర జీవరాశితోపాటు మట్టిలో సూక్ష్మజీవరాశి వైవిధ్యత కూడా పెరుగుతుందని ఐరాసకి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవం(మే 22) సందర్భంగా మరికొన్ని విషయాలు..

- ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల్లో భూమి పైన పంటలు, పక్షులు, తేనెటీగల్లాంటి మిత్రపురుగులతోపాటు భూమి లోపల వానపాములు, సూక్ష్మజీవరాశికి సంబంధించిన జీవవైవిధ్యం 30–50% పెరుగుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని 'ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్' తాజా నివేదిక చెబుతోంది. ఈ క్షేత్రాల్లో పంటలు, పక్షులు, మిత్రపురుగులు, సూక్ష్మజీవుల సంఖ్య 50% ఎక్కువగా ఉంటుందని, వీటి జాతుల సంఖ్య 30% అధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.
- రసాయనాలు వాడని గడ్డిభూముల్లో కన్నా ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో సాగయ్యే వార్షిక పంటల్లో, పండ్ల తోటల్లో జీవవైవిధ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.
- ప్రకృతి/సేంద్రియ సాగులో తేనెటీగలు, సాలీళ్లు, తదితర అరుదైన మిత్రపురుగుల సంఖ్య రసాయనిక క్షేత్రాలతో పోల్చితే 55% ఎక్కువగా, వీటి జాతుల వైవిధ్యం 27% ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది.
- ప్రకృతి/సేంద్రియ క్షేత్రాలు ఉన్న ప్రాంతాల్లో నాటు తేనెటీగల సంఖ్య, జాతుల వైవిధ్యంతో పాటు వాటి పునరుత్పత్తి రేటు కూడా పెరిగిందని ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్ నివేదిక తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్‌లో 50 ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, 50 రసాయనిక వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించే పక్షుల సంఖ్యపై ఏపీ ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్) గత ఏడాది ఓ అధ్యయనం చేసింది.
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రెండు తోకల పిట్ట, నేత పక్షి, గిజిగాడి గూడు పక్షి, పిగిలి పిట్టలు 2,3 రెట్లు ఎక్కువగా తరచూ తిరుగాడుతూ కనిపించాయని ఏపీసీఎన్ఎఫ్ నిపుణుడు ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ఏపీసీఎన్ఎఫ్ పరిశోధనా విభాగం హెడ్ డా. జాకిర్ హుస్సేన్ తెలిపారు. రసాయనిక క్షేత్రాల కన్నా ప్రకృతి పొలాలను ఎక్కువ పక్షులు సందర్శిస్తున్నాయన్నారు. పక్షుల రాక వల్ల శతృపురుగుల తీవ్రత తగ్గుతున్నదన్నారు.
- కర్నూలు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే చోట ప్రకృతి పొలాల్లో నేత పక్షి గూళ్లు కనిపించటం విశేషం.

మిత్రపురుగుల సేద్యం

■ ఎకలాజికల్ ఇంజనీరింగ్ సాగు పద్ధతులను ప్రాచుర్యంలోకి తెస్తున్న ఎన్.ఐ.పి.హెచ్.ఎం.







తేనెటీగలు.. ఇవి 3 కోట్ల సంవత్సరాల క్రితం నుంచే భూగోళంపై జీవిస్తున్నాయి. మొక్కల/వ్యవసాయ జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు పరాగ సంపర్కం కీలకం. అడవిలో 90% మొక్కలు, చెట్లకు, 75% పంటలకు తేనెటీగలు తదితర ప్రాణుల వల్ల జరిగే పరాగ సంపర్కమే ఆధారం. 115 ప్రధాన ఆహార పంటలు ప్రపంచ ప్రజల ఆకలితీర్చుతున్నాయి. వీటిలో 87 పంటలు పుష్పించి సక్రమంగా పంట దిగుబడులు ఇస్తున్నాయంటే అందుకు 35% కారణం తేనెటీగలు తదితర చిరు మిత్ర జీవులే. రసాయనిక వ్యవసాయ పద్ధతులు, చెట్లను నరికేయటం వల్ల వీటి మనుగడ ప్రమాదంలో పడింది. తేనెటీగలు వంటి మిత్ర పురుగులను రక్షించుకోవటం మన ఆహార భద్రతకు, పర్యావరణ ఆరోగ్యానికి ప్రాణావసరమని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) చెబుతోంది. మనం వినిపించుకోవాలి.

ప్రతి నాలుగు పంటల్లో మూడు పంటలు తేనెటీగల సేవలు అందుకుంటున్నాయి. బాదం పంట దిగుబడులైతే నూటికి నూరు శాతం వీటిపైనే ఆధారపడి ఉంటుంది. తేనెటీగలకు 5 కళ్లు, రెండు రెక్కలుంటాయి. కొన్నయితే గంటకు 20 మైళ్లు ప్రయాణిస్తూ పరాగ సంపర్కానికి తోడ్పడుతుంటాయి.

పంటల మార్పిడి, వైవిధ్యత..

పర పరాగ సంపర్కానికి తోడ్పడే ఈ చిరుప్రాణులకు హాని కలిగించని బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించమని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం (మే 20) సందర్భంగా ఎఫ్.ఎ.ఓ. పిలుపునిచ్చింది. 'పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, రసాయనిక పురుగుమందుల వాడకాన్ని తగ్గించటం, పరాగ సంపర్కానికి దోహదపడే తేనెటీగలు వంటి చిరు జీవులకు అవసరమైన ఆవాసాలను అంటే చెట్లను, పూల వనాలను పునరుద్ధరించటం, అభివృద్ధి చేయటం వంటి చర్యలు తీసుకోవాలని ఎఫ్.పి.ఓ. డైరెక్టర్ జనరల్ క్యు డోంగ్యు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు, రైతులు ఈ పిలుపును అందుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గిస్తే నీటిలో వీటి అవశేషాలు తగ్గుతాయి. తేనెటీగలకు మేలు జరుగుతుంది అన్నారాయన.



తేనెటీగల పరిరక్షణకు స్లావేనియా విశేష కృషి చేస్తోంది. 2016 నుంచి మే 20వ తేదీని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకోవడానికి స్లావేనియా ప్రభుత్వ కృషే కారణం. ఖండాంతర దేశాల్లో 300కు పైగా తేనెటీగల పరిరక్షణ కార్యక్రమాల్లో స్లావేనియా భాగస్వామైంది.

* * *

ఎన్.ఐ.పి.హెచ్.ఎం. అధ్యయనం

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) శాస్త్రవేత్తలు తేనెటీగలు సహా అనేక మిత్ర పురుగుల వల్ల ఏయే పంటల సాగులో ఏ విధంగా ప్రయోజనం ఉంటుందనే అంశంపై అధ్యయనం చేశారు. మిత్రపురుగుల సంరక్షణతో కూడిన 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' పద్ధతులపై జరిగిన అధ్యయనానికి అదనపు సంచాలకులు(పిహెచ్ఎం) డాక్టర్ ఈడ్పుగంటి శ్రీలత సారథ్యం వహించారు. పొద్దుతిరుగుడు, జనుము, మొక్కజొన్న, స్వీట్‌కార్న్, వంగ, బెండ, గుమ్మడి, సొర, బీర, చెర్రీ తదితర పంటలపై ఈ అధ్యయనం జరిగింది. గట్ల మీద పూల మొక్కలు సాగు చేశారు. 9 జాతులకు చెందిన 14 రకాల ఈగలు ఈ కూరగాయ తోటల్లో పరాగసంపర్కానికి దోహదపడినట్లు గుర్తించారు. అందులో 5 రకాల తేనెటీగలు ఉన్నాయి. వంగ తోటలో 14 రకాల ఈగలు కనిపించటం విశేషం.

తేనెటీగలను మింగుతున్న రసాయన సేద్యం

● బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో 20% తగ్గిన మిత్రపురుగులు

వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పెరుగుతున్న కొద్దీ సహజ తేనెటీగల సంఖ్య తగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది. బెంగళూరు ప్రాంతంలో జరిగిన ఓ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. నగరం చుట్టూతా విస్తరించిన 40 కిలోమీటర్ల ప్రాంతంలోని 60 గ్రామాల్లో అధ్యయనం చేస్తే సహజ తేనెటీగల సంఖ్య ఏకంగా 20% తగ్గినట్లు వెల్లడైంది. జర్మనీకి చెందిన గొట్టింజెన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశోధించింది. రసాయనిక వ్యవసాయం విస్తీర్ణం, సాంద్రత పెరుగుతున్నకొద్దీ తేనెటీగలు సమూహాలు తగ్గిపోతుండటాన్ని గుర్తించారు.

▶ నగరం నుంచి ప్రతి కిలోమీటరు దూరంగా వెళ్లే కొద్దీ ఆయా ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 2.4% మేరకు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ▶ 2016 డిసెంబర్– మే 2017 మధ్య 1275 కుటుంబాలపై అధ్యయనం చేశారు. ఇందులో 638 రైతు కుటుంబాలు. 3 కుటుంబాలకు చెందిన 31 జాతుల తేనెటీగలు ఆ ప్రాంతాల్లో గుర్తించారు. ▶ చెట్ల మీదనే కాకుండా నేలలో బొరియలు చేసుకొని ఆవాసాలను ఏర్పాటు చేసుకునే తేనెటీగలు ఉంటాయి. కాబట్టి, రసాయనిక పురుగుమందుల వల్లనే కాకుండా రసాయనిక ఎరువులు లేదా నీటి పారుదల వల్ల కూడా తేనెటీగల సంఖ్య తగ్గుతున్నట్లు గుర్తించారు. ▶ ఒక రైతు తన పొలంలో రసాయనిక ఎరువులు వాడటం లేదా నీటి తడి పెట్టడం చేస్తే అక్కడ తేనెటీగల సంఖ్య 20% తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.

▶ పరిసరాల్లోని ఒక్కో పొలంలో పురుగుమందులు చల్లినప్పుడల్లా ఒక్కో శాతం తేనెటీగల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. అత్యధికంగా 80% మంది రైతులు, సగటున 25% మంది రైతులు రసాయనిక పురుగుమందులు చల్లుతున్నారు. ఆ మేరకు తేనెటీగల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ▶ అనేక సంవత్సరాల నుంచి ఉధృతంగా రసాయనిక వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో తేనెటీగలు 8.1% మేరకు తగ్గింది.

▶ రోడ్డుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 17.3% తగ్గిపోయింది. అదే విధంగా, దగ్గర్లో అడవి లేదా చెరువు ఉన్న చోట్ల 30–39% పెరిగింది. ▶ వ్యవసాయంలో విషరసాయనాలు, ముఖ్యంగా నియోనికోటినాయిడ్స్, వాడుతుండటం వల్ల తేనెటీగల నాడీవ్యవస్థ దెబ్బతింటున్నది. ఈ ప్రభావం వల్ల తేనె సేకరణకు వెళ్లిన తేనెటీగలు, ఇంకా ఇతర మిత్ర పురుగులు తిరిగి గూళ్లకు చేరకుండానే నేలరాలుతున్నట్లు పరిశోధకులు గుర్తించారంటున్నారు తేనెటీగల సంరక్షకురాలు జీవీ అపూర్వ.

ఎకలాజికల్ ఇంజనీరింగ్ అంటే?

'ఎకలాజికల్ ఇంజనీరింగ్' భావనను 1962లో తొలుత ప్రతిపాదించిన శాస్త్రవేత్త డా. హొవర్డ్ టి. ఒడుమ్. రసాయనిక సాంద్ర వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించి, పంట పొలాల్లో పర్యావరణ వ్యవస్థలను పునరుజ్జీవింపజేయటం. తద్వారా మొక్కలు, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం. ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవటం ఈ భావన ముఖ్య లక్ష్యం. భూమిని బాగు చేయడానికి ఆచ్ఛాదన పంటలు, పంటల మార్పిడి, పచ్చిరొట్ట పంటలను సాగు చేసి కలియదున్నటం, సేంద్రియ ఎరువులతో పాటు జీవన ఎరువులు, జీవ రసాయనాలు వినియోగించటం ఎకలాజికల్ ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన అంశాలు.

మిత్రపురుగులను ఆకర్షించడానికి ఆకర్షక పంటలు, శతృపురుగులను ఆకర్షించి మట్టుబెట్టడానికి ఎర పంటలు, శతృపురుగులను పారదోలడానికి వికర్షక పంటలు, పురుగులు తోటలోకి రాకుండా చూడడానికి కంచె/సరిహద్దు పంటలు వేసుకోవటం చీడపీడల నియంత్రణలో కీలకం. 'పంటల తొలి 40 రోజుల్లో రసాయనిక పురుగుమందులు వాడకుండా ఉండటం ముఖ్యం. ఈ దశలోనే తేనెటీగలు సహా అనేక రకాల మిత్రపురుగులు వృద్ధి చెంది పంటకాలం అంతటా చీడపీడలను నియంత్రణలో ఉంచుతాయి..' అంటున్నారు డా. శ్రీలత . 86 పంటల 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' కోసం వెబ్‌సైట్ చూడొచ్చు.. https://niphm.gov.in/



బెండ పంటను రక్షించే మిత్ర పురుగులు

